## క్లుప్తంగా

### 14, 15 న విద్యార్థులకు ఉచిత వక్త శిక్షణ

ఒంగోలు టౌన్: విద్యార్థులను సమాజానికి పనికివచ్చే భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరంట్స్ (స్టెప్) ఆధ్వర్యంలో ఉచిత వక్త శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు స్టెప్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ధన్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండంలోని నెక్కళ్లు శ్రీరమణారావు సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమంలో పాల్గొనే అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన డిగ్రీ నుంచి పీజీ వరకు చదువుకున్న, చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు వెంటనే తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్ ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మిగతా వివరాలకు డా.ప్రత్యూష సుబ్బారావు 9030644440, ధర్మారెడ్డి 8143234555కు ఫోన్ ద్వారా సంప్రదించాల్సిందిగా తెలిపారు.

### రోగులు సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళ్లాలి


ఇన్‌ఫెక్షన్ ఫ్రీ శిక్షణ శిబిరం ప్రారంభ సభలో ప్రసంగిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాదేవి

ఒంగోలు టౌన్: వైద్య చికిత్స కోసం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చిన రోగులు సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి అయ్యేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు సూచించారు. రెండు రోజుల పాటు జరిగే ఇన్‌ఫెక్షన్ ఫ్రీ ప్రోగ్రాం శిక్షణ శిబిరాన్ని మంగళవారం సూపరింటెండెంట్ డా.దుర్గాదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలలోని ప్రతి వస్తువు, పరికరం పరిశుభ్రంగా ఉండేలా జాగ్రతలు తీసుకోవాలని చెప్పారు. బెడ్‌షీట్ నుంచి నీడిల్ వరకు ఇన్‌ఫెక్షన్ ఫ్రీగా ఉండాలన్నారు. డా.కళ్యాణి, డా.తిరుమలరావు ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణ అందరికీ ఉపయోగపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను మిగతా వారికి కూడా తెలియజేయాలని సూచించారు. ఆస్పత్రి నుంచి ఆరోగ్యంగా, ఆనందంగా రోగి ఇంటికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. దుర్గాదేవి చెప్పారు. హెచ్‌ఐవీ రోగులకు చికిత్స చేసే విషయంలో సిబ్బంది ఎంతో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సూపరింటెండెంట్ డా.ప్రభాకరరావు సూచించారు. అశ్రద్ధ వహిస్తే హెచ్‌ఐవీ సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ శిబిరాన్ని సిబ్బంది సద్వినియోగం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

### బావమరిదిపై బావ కత్తితో దాడి

ఒంగోలు టౌన్: అక్కను కొట్టనీయకుండా అడ్డుకోబోయిన బావమర్దిపై అతని బావ కత్తితో దాడి చేసిన ఘటన నగరంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. ఏకలవ్య నగర్‌కు చెందిన శ్రీరాముల పరంత్ ఒక ప్రైవేటు బ్యాంకులో సెంటర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతని సోదరి స్పందనను జగన్నాథం కిశోర్‌కు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లైన నాటి నుంచి భార్య స్పందనను మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కన్నవారి ముందే స్పందనను కొడుతుండగా పరంత్ అడ్డుకొని మందలించాడు. దాంతో ఆగ్రహానికి గురైన కిశోర్ పక్కనే ఉన్న కూరగాయలు కోసే కత్తితో బావమరిది వీపు, కంటి కింద పొడవడంతో గాయాలయ్యాయి. భయంతో పరంత్ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కాపాడారు. అనంతరం అతన్ని చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించారు. సీఐ వై. నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### పొగాకు గరిష్ట ధర రూ. 358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధరలు సోమవారం గరిష్టంగా కేజీ రూ. 358 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి తదితర కేంద్రాల్లో 146వ రోజు వేలం పాటలో 5187 బేళ్లు రాగా 3936 బేళ్లు కొనుగోలయ్యాయి. 1251 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు.






కర్నూల్ రోడ్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్లో వరసిద్ధి వినాయక స్వామి పూజ


గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

# బొజ్జ గణపయ్యా.. దీవించవయ్యా!


హౌసింగ్ బోర్డ్ దగ్గర వరసిద్ధి వినాయక స్వామి పూజలో భక్తులు


రాజపానగల్‌రోడ్డులో


కోర్టు సెంటర్‌లో బెలూన్లు, విద్యుద్దీప అలంకరణలో మట్టి వినాయకుడి విగ్రహం


ఒంగోలు మెట్రో: ఒంగోలు శ్రీగిరి కొండ వద్ద నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం పది గంటలకు వన్ టౌన్ సీఐ వై. నాగరాజు వరసిద్ధి వినాయక పూజా క్రతువులు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు గణపతి మండప నిర్వాహకురాలు ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ జడా వెంకటేష్, తూము సుబ్బారావు, పాట్టేళ్ల సుబ్రహ్మణ్యం, దుర్గమ్మ, నారాయణ, గాబ్రేలు, అనిల్, వెంకట్రావు, ప్రసాద్, సునీల్, తిమోతి, చెన్నకేశ్వర్లు, నాని, బుజ్జి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**కొత్త డొంకలో మిలటరీ కాలనీలో..**

స్థానిక మంగమూరు రోడ్డు శివప్రసాద్ కాలనీ కొత్త డొంక, మిలటరీ కాలనీ, యానాది సంగంలో వరసిద్ధి వినాయక స్వామి పూజలు జరిగాయి. తీర్థప్రసాదాలను అందజేశారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ, పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డు, మహిళా మిత్రమండలి వాకిటి నాగమణి ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు.


మంగమూరు రోడ్డు అఖిలానంద ఆశ్రమంలో గణపతి నవరాత్రులు సందర్భంగా కోలాట నృత్య ప్రదర్శనలో భక్తులు


శ్రీగిరి కొండపై వినాయకుని అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న వన్ టౌన్ సీఐ నాగరాజు


గానుగపాలెంలో..

## నవరాత్రుల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు


చిన్నారులకు లెమన్ స్పూన్ పోటీలు


మ్యూజికల్ చైర్ పోటీల్లో చిన్నారులు

మద్దిపాడు: మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, సాంఘిక నాటకాలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నందిపాడులో సాంఘిక నాటకం ప్రదర్శించగా గుండ్లాపల్లిలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. స్పూన్ అండ్ లెమన్, మ్యూజికల్ చైర్స్, కుండ కొట్టే పోటీలు చిన్నారులు, యువకులు, పెద్దవారికి వివిధ క్యాటగిరీల్లో నిర్వహించారు. పోటీల్లో గెలిచిన వారికి బుధవారం రాత్రి శివాలయం వద్ద బహుమతులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు చిన్నారులతో పాటు పెద్దలు కూడా అత్యంత ఉత్సాహంగా హాజరయ్యారు.

## జూనియర్ చాంబర్ కార్యక్రమాలు అభినందనీయం



కార్యక్రమంలో అతిథులు

ఒంగోలు: ఒంగోలు జూనియర్ చాంబర్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని ఒంగోలు తాలూకా సీఐ కె.అజయ్ పేర్కొన్నారు. స్థానిక కాపు కళ్యాణమండపంలో జేసీస్ నిర్వహిస్తున్న వారోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ జేసీఐ సేవాకార్యక్రమాలు, ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, యువతకి విద్యార్థుల అభివృద్ధికి చాలా ఉపయోగ పడే విధంగా ఉన్నాయన్నారు. వారోత్సవాలు పండుగలా నిర్వహిస్తున్న మీ కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని కోరారు. అనంతరం స్కూల్ స్థాయి విద్యార్థులకి వెస్ట్రన్ డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కొరియోగ్రాఫర్ బాలాజీ, ఇంద్రజ్యోతి వ్యవహరించారు. ముందుగా వివిధ రంగాల్లో సేవ చేసిన వయో వృద్ధులను, 49 సంవత్సరాల క్రితం ఒంగోలు జూనియర్ చాంబర్ ప్రారంభించిన పెద్దలను సన్మానించారు. రిటైర్డు డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌డీ ఇస్మాయిల్ అవ్వాతాతలతో ఆటాపాటా కార్యక్రమాన్ని త్రోవగుంటలో కాకతీయ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. గెలుపొందిన వారికి జూనియర్ చాంబర్ అధ్యక్షుడు కె. వరుణ్, వారోత్సవాల చైర్మన్ శబరీ నాయర్ బహుమతులు పంచారు. అతిథులు సరస్వతి విద్యాసంస్థలు అధినేత, ఏవీ రమణారెడ్డి, జూనియర్ చాంబర్ జాతీయ పూర్వ అధ్యక్షుడు నయనాల రామకృష్ణ, విజేత రమణ, బొమ్మల శ్రీను, ఎం.శేఖర్ బాబు, కసిబిసి నాగేశ్వరరావు, వారోత్సవాల కార్యదర్శి సాత్విక్ రాజ్, కో చైర్మన్స్ కె. శివకోటి రెడ్డి, గంధవల్ల బాలకృష్ణ, ట్రెజరర్ నరేంద్ర. వి. రవీంద్ర, ఏ.బ్రహ్మయ్య, సోమినేని సురేష్, నంద కుమార్ పాల్గొన్నారు.

## స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ఏడుగురు మెడికోల ఎంపిక


రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన ఒంగోలు మెడికల్ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఏడుకొండలు

ఒంగోలు టౌన్: అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్ రీసెర్చ్ స్కాలర్‌షిప్ (యూజీఎస్ఆర్ఎస్)కు ఒంగోలు మెడికల్ కళాశాలకు చెందిన ఏడుగురు వైద్య విద్యార్థులు ఎంపికయ్యారు. ఏటా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఈ స్కాలర్‌షిప్ కోసం పేపర్స్‌ను ఆహ్వానిస్తుంది. ఈ ఏడాది మధుమేహం, సైకాలజీ, సర్జరీ విభాగాల్లో ఈ విద్యార్థినుల ఎంపికయ్యారు. వీరంతా రెండు నెలలపాటు ఆయా విభాగాల్లో పరిశోధన చేయాల్సి ఉంటుంది. ఫీల్డ్‌లో పరిశోధన పాటుగా మందులు, ఇతర అంశాల గురించి అధ్యయనం చేయాలి. వైద్య విధానంలో వచ్చే మార్పులను తెలుసుకునేందుకు, భవిష్యత్తులో పరిశోధన, టీచింగ్ రంగాలవైపు మళ్లిందుకు ఈ పరిశోధన ఉపకరిస్తుందని ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు తెలిపారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన టి.శ్రీనాగవల్లి గోపాలుని, మలిశెట్టి సాయి దీపక్, కొర్లకుంట వైష్ణవి, పదాల ధనుష్య శ్రీ, బి. ఫణి సాయిశ్రీ, ఆషిమా, ఎ.స్నేహ భార్గవిలను ఆయన అభినందించారు.

### దౌర్జన్యంగా చెట్లు నరికారని ఫిర్యాదు

చీమకుర్తి: మంగమూరు ఎస్సీ కాలనీకి చెందిన కుటుంబాలు వివాహాది శుభ కార్యక్రమాలకు సంబంధించి విడిది దిగు స్థలంలో నీడనిచ్చే చెట్లను స్థానిక అగ్రవర్ణ నాయకులు దౌర్జన్యంగా తొలగించాలరని ఆ గ్రామానికి చెందిన దళిత నాయకులు ఎస్పీ, కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో ట్రయాంగిల్‌లో చెరువు పరీవాహక ప్రాంతంలో చెట్ల నీడన దళితులు విడిది దిగుతుండటమే కాకుండా వేసవి కాలంలో నీడ పట్టున సేద తీరుతుంటారని మంగమూరు ఎస్సీ కాలనీకి చెందిన అట్లూరి మత్తయ్య, పరిశుద్ధం, తేళ్ల యోహాను, సాంబయ్య ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో పాటు సంతనూతలపాడు ఎస్సైకి వినతిపత్రం ఇస్తున్నట్లు తెలిపారు. మంగమూరు గ్రామానికి చెందిన అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి నారాయణ మరికొంతమంది చెట్లను కొట్టివేయవద్దన్నందుకు తమను కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యానికి పాల్పడ్డారని వారు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని జిల్లా అధికారులకు విన్నవించుకున్నట్లు తెలిపారు. దానిపై ఇంకా కేసు నమోదు చేయాలేదని ఎస్సై తెలిపారు.

### 22న జిల్లా స్థాయి యోగా పోటీలు

ఒంగోలు మెట్రో: యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 22 వ తేదీ ఆదివారం ఒంగోలు అంజయ్య రోడ్డుని ఆంధ్రకేసరి విద్యా కేంద్రంలో యోగా పోటీలు నిర్వహించనున్నారు. వివిధ కేటగిరీల్లో ఔత్సాహికులు హాజరు కావచ్చు. ట్రెడిషనల్ ఈవెంట్, ఆర్టిస్ట్ సోలో, ఆర్టిస్ట్ పెయిర్, రిథమిక పెయిర్, విభాగాలకు గాను అన్ని కేటగిరిల్లో పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో సెలెక్ట్ అయిన వారు రాష్ట్ర స్థాయిలో.. ఆ తరువాత జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని పొందవచ్చు. ఆసక్తి ఉన్నవారు 7780680121, 9490163312 నంబర్లను సంప్రదించవచ్చు. ఈనెల 21, వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

### ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ హర్షదేవ్‌కుమార్ ప్రీతమ్


ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా ఉత్తర్వులు అందుకుంటున్న డాక్టర్ హర్షప్రీతమ్‌దేవ్ కుమార్

ఒంగోలు: ఆంధ్రకేసరి యూనివర్శిటీ జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) కో ఆర్డినేటర్‌గా సోషల్ వర్క్ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ మండే.హర్ష ప్రీతం దేవ్ కుమార్‌ను మరో మారు నియమిస్తూ ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బీ హరిబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబుల నుంచి హర్ష ప్రీతమ్‌దేవ్ కుమార్ ఉత్తర్వులు అందుకున్నారు. యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ రాజమోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలా మణి, సీడీసీ డీన్ డాక్టర్ జి.సోమ శేఖర, సోషల్ వర్క్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ పిల్లి వెంకట రావు, ఇంజినీరింగ్ విభాగం ఇన్చార్జి డాక్టర్ ఆర్.శ్రీనివాస్, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## ఘనంగా వినాయకుడి నిమజ్జనం


పూజలు చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి

చీమకుర్తి: వినాయక నిమజ్జనోత్సవం మంగళవారం చీమకుర్తిలో ఘనంగా జరిగింది. చీమకుర్తి పట్టణంలోని ఏకలవ్యనగర్‌లో స్థానిక గిరిజనులు ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద అద్దంకి వైఎస్సార్ సీపీ పరిశీలకులు మారం వెంకారెడ్డి హాజరై స్వామి వారికి పూజలు చేశారు. స్వామి వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. విగ్రహం వద్ద పూజలు అందుకున్న లడ్డూను వేలం పాటలో దేవరకొండ బాలు రూ.36,500 దక్కించుకున్నారు. అనంతరం విగ్రహాన్ని ఊరేగింపుగా తరలించారు. కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర నాయకులు పేరం శ్రీనివాసరావు, బడే దశరథరామిరెడ్డి, దేవరకొండ తిరుపతయ్య, పేరం అంజయ్య, స్థానికులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగులకు అభినందన


ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అభినందన

ఒంగోలు: ఆర్టీసీ ఒంగోలు డిపోలో ఆగస్టు నెలకు గాను అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ డి.శ్రీనివాస్, షయానా బేగం అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్)లు అభినందించారు. శ్రీమతి విజయ అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్), సెక్యూరిటీ ఏఐ, అసోసియేషన్ నాయకులు, ఉద్యోగస్తులు మాట్లాడారు. సూపర్‌వైజర్లు, ఉద్యోగస్తులు సమష్టి కృషి చేయడంతో ఈపీకే .. కేఎంపీఎల్‌లో ద్వితీయ స్థానంలో ఒంగోలు డిపో నిలిచిందని తెలిపారు. ఇందులకు గాను సూపర్ వైజర్లు, ఉద్యోగస్తులను అభినందించినట్లు తెలిపారు.



### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఒంగోలు టౌన్: వినాయక చవితి పురస్కరించుకొని నిమజ్జనం కోసం సామగ్రిని తీసుకొని వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం .. నాగులుప్పలపాడు మండలంలోని టి. అగ్రహారానికి చెందిన పులగూర తరుణ్ (21), ప్రమోద్ కలిసి వినాయక నిమజ్జనానికి సంబంధించి పూలు, సామగ్రి కొనుక్కునేందుకు మంగళవారం ఉదయం ఒంగోలు వచ్చారు. తిరుగు ప్రయాణంలో గుంటూరు రోడ్డు హైవేలో శ్రీ సూర్య కాలేజీ సమీపంలోకి రాగానే మోటారు బైకు అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీ కొన్నారు. దాంతో కింద పడిపోయిన తరుణ్ తలకు బలమైన గాయమైంది. అతడిని వైద్య చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్ తీసుకొని వెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన ప్రమోద్ చికిత్స పొందుతున్నాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తరుణ్ తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. రాడ్ బెండింగ్ పని చేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. చేతికి అంది వచ్చిన కుమారుడు అర్థాంతరంగా మరణించడంతో తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు.

## ఆదర్శంగా కొత్తపట్నం మండలం

కొత్తపట్నం: కొత్తపట్నం మండలంలో సాగుబడి చేస్తున్న ప్రకృతి వ్యవసాయం బాగుందని, ఈ మండలాన్ని ఆదర్శంగా తీసుకుని గుజరాత్ రాష్ట్రంలో అవలంబిస్తామని గుజరాత్ బృంద సభ్యులు అభినందించారు. రైతు సాధికార సంస్థ.. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి ఆధ్వర్యంలో 20 మంది గుజరాత్ బృందంతో రెండో రోజు మంగళవారం మండలంలో పర్యటించారు. ముందుగా ఈతముక్కల అంగన్‌వాడీ కేంద్రంలో హెల్త్ అండ్ న్యూట్రిషన్ జరిగే కార్యక్రమం గురించి తెలుసుకున్నారు. ఆహార వైవిధ్యత, అంగన్‌వాన్‌వాడీ స్కూల్ జెడ్పీఎస్ఫ్ రైతులతో అనుసంధానం, ఫార్మర్ న్యూట్రిషన్ స్కూల్‌లో గర్భిణీ, బాలింత, కుకింగ్ డెమోన్‌స్ట్రేషన్స్ వివరించారు. డ్వాక్రా మహిళా సంఘాలు ప్రకృతి వ్యవసాయం ఎంత వరకు నేర్చుకున్నారు, ఎంత ఆదాయం వస్తుంది అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ బాస్కెట్ గురించి, హ్యాండ్ వాష్ స్టేప్స్, టాయిలెట్స్ యూసెజ్ గురించి వివరించారు. అనంతరం కొత్తపట్నంలో పురిణి మల్లేశ్వరమ్మ వేరుశనగ పంటను పరిశీలించారు. గుజరాత్ రాష్ట్రంలో వారు చేస్తున్న వ్యవసాయానికి.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న వేరుశనగ పంటకు మధ్య వ్యత్యాసాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌కేబీఎస్ హైతుల్లా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న 30 రకాల విత్తనాలతో సాగు చేస్తున్న ప్రీమూన్ డ్రైసోయింగ్ విధానాన్ని పరిశీలించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రకృతి వ్యవసాయం శ్రీనివాసరావు, అగ్రికల్చర్ ఆఫీసర్ హుమయున్, మోహన్‌రెడ్డి, సతీష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


కషాయాలతో పండించిన వేరుశనగ పంట దిగుబడును పరిశీలిస్తున్న గుజరాత్ బృందం


అంగన్‌వాడీ పిల్లలతో మాట్లాడుతున్న బృందం